# చెలిమి



— జలంధర

"ఏమిటి రాజీ ఇలా చేశావు?" అంటూ కుర్చీలాక్కుని కూర్చుంది రాధిక. చుట్టూ ఒక్కసారి పరీక్షగా చూసింది. అది వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఒకగది. తెలియని నిశ్శబ్దం. అప్పుడప్పుడు కారిడర్స్‌లో నించి మాటలు... వాతావరణం ఏక వినుగ్గా వుంది.

ఆమె వంక ఒకసారి కళ్లెత్తి పరీక్షగా చూసి మళ్లీ కళ్లుదించుకున్నది రాజీ. నన్నగా, నాజూగ్గా ఉండే పింగాణీ బొమ్మలా, చిన్న డైమండ్ స్టడ్స్‌తో... చక్కటి పిల్ల రాధిక.

తన వంక పరీక్షగా చూసి కళ్లువాల్చి చేతిలో పుస్తకం వంక సీరియస్‌గా చూస్తున్న ఆమెను తను కూడా పరీక్షగా చూసింది రాధిక. బొద్దుగా, కొంచెం పొట్టిగా పెద్ద అందగత్తె ఏం కాదు రాజీ. కానీ, తెలివిగల ముఖం... కళ్లల్లో మెరుపు... చటుక్కున నవ్వే పెదవులు... చూడగా చూడగా ఈ అమ్మాయిని తను వదులుకోలేనేమో అనిపిస్తుంది.

చిన్ననాటి స్నేహితురాళ్లైన వాళ్లిద్దరూ ఒకర్నొకరు పరీక్షగా చూసుకోవాల్సిన అవసరమేమీ లేదు నిజానికి—కానీ, ఈ రోజు చాలా చిత్రమైన రోజు. రాధికకు అర్థంకాని స్థితి, రాజీ జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి ఇది.

"ఊం! కాఫీ తాగు..." ఫ్లాస్కులోనించి కాఫీ పోసింది రెండు కప్పుల్లో రాజీ... రాజీ జీవితం నగటు మామూలు ఆడపిల్ల జీవితమే అయినా, రాజీ మాత్రం మామూలు అమ్మాయి కాదు.

కేవలం పన్నెండు వందల రూపాయల ఉద్యోగం, నాలుగో కాన్పులో పుట్టిన కొడుకుకు స్వాగతం వలకడానికా అన్నట్లు ముందే పుట్టిన ముగ్గురు ఆడపిల్లలు. ఏనాడో హరించుకుపోయిన ఆస్తి తాలూకు అనవసరపు హోదాకు చిహ్నంగా మిగిలిన కాలు విరిగిన రోజ్ వుడ్ టేబులు, పాత కాలపు గోడ గడియారం, రెండు పెద్ద గుండిగలు... ఇవీ గొప్ప కులంలో పుట్టిన సత్యనారాయణ గారు అనే రాజీ తండ్రి బయోడేటా... ఆయనకు ప్రస్తుతం ఉన్న ఐదారు వేల రూపాయల అప్పు పెద్ద బరువు కాదేమో. కానీ పెళ్లికెదిగిన ఆడపిల్లలు, ఇంకా ఇంట్లో అంతరించిపోనిహోదా చిహ్నాలుగా పండుగలు, పూజలు, వ్రతాలు, ఆనవాయితీగా బట్టలు, 'మీ బామ్మ కాలంలో అలా జరిగింది, మీ తాతగారు దివాన్‌గిరీ చేసేటప్పుడు...' అని చెప్పుకునే కలల ప్రపంచంలో ఆయన మహారాజు... ఆయన జీవితం అనే మండువా ఇంటి మూలస్థంభం దేశంలో వచ్చిన ఆర్థిక రాజకీయ వ్యవస్థల వల్ల, తన హోదా పట్టుదల వలన చెదలు పట్టిందని మర్చిపోతాడు ఆయన.

పెద్దింటి ఆడబడుచు అయిన ఆయన భార్య స్థూల కాయంతో, తెలియని నీరసంతో, గతించిపోయిన పుట్టింటివారి వైభవం మాట్లాడుతూ, నూనె కిలో ముప్పై అయిదు రూపాయలైనా ఆలోచించకుండా బజ్జీలు, గారెలు మధ్యాహ్నం టిఫెన్ కిందచేసే మహా ఇల్లాలు.

ఈ సంస్కృతిలో పెరిగిన పెద్దపిల్ల రాజీ చాలా తెలివిగా మేలుకుని ఎదిగి, ఆలోచించడం ప్రారంభించింది.

"అమ్మా! పామాయిలు రేషన్‌లో దొరుకుతోంది, వాడచ్చు కదా! అంతంత ఖరీదు పెట్టి కాఫీ పొడి కొనకపోతే, రాగిమాల్టు చెయ్యకూడదూ. కిలో రాగులు కొంటే బోలెడంత పిండి. పైగా విటమిన్స్..." అని లెక్చర్లిచ్చేటంతగా ఎదిగిపోయింది.

"నీ మొహం... అంత నిత్య దరిద్రమే నీకు... అబ్బ... ఇవి మా పుట్టింటారి పోలికలు కావమ్మా..." అని ఒక్క మాటలో తీసి పారేసేది తల్లి.

"నాన్న జీతంలో నగం జీతం కూడా రాని ప్యూను దగ్గర ఆయన రెండు రూపాయల వడ్డీకి డబ్బు తీసుకోవడం హెూదానా?" అని ఒళ్లు మండి అడిగి "నోరు మూసుకో" అని జవాబు వినేది.

"అందరం 'రిడక్షన్ సేల్' లో కాటన్ డ్రెసస్ కొందామంటే తమ్ముడికి మట్టుకు 150 రూ. పెట్టి టెరికాటన్‌వి ఎందుకు కొన్నావు నాన్నా" అని పోట్లాడేది రాజీ.

"వాడు మగపిల్లవాడు వాడికీ నీకూ సామ్యం ఏమిటే?" అని అమ్మ దీర్ఘం తీస్తుంటే, కాఫీలో చక్కెర తక్కువైతేనే పేట్రేగిపోయే నాన్న చాచిలెంపకాయ ఎందుకు కొట్టడా అని ఆలోచించేది. కానీ ఇవన్నీ మధ్య తరగతి మనుషులకు పట్టిన జబ్బులని... ఈ ఆలోచనలూ, ఈ భావావేశం, ఈ ఫాల్స్ ప్రిస్టేజ్ మీదే వాళ్లు బ్రతుకుతారని చాలా ఆలస్యంగా అర్థంచేసుకున్నది రాజీ. రాజీ స్నేహితురాలు రాధిక తండ్రి కోటీశ్వరుడు. వాళ్లింట్లో కుక్కలకే ఫేరెక్స్, హార్లిక్స్ పోస్తారు. వాళ్ల కారు పెట్రోల్ ఖరీదు రాజీ తండ్రి నెల జీతం. కానీ ఇద్దరూ చిన్నప్పటినుంచీ స్నేహితులు. రాధిక స్వతహాగా మంచి పిల్ల. ఆమె డబ్బు, హెూదా ఆ పిల్లకు అమాయకత్వాన్నే ఇచ్చాయి కానీ, అసహ్యకరమైన స్టేటస్ జబ్బు ఇవ్వలేదు. అందుకే మిడిల్ క్లాస్ రాజీని వదులుకోలేకపోయింది. పైగా తన కన్న రాజీ వెయ్యిరెట్లు తెలివిగలది, గొప్పగా ఆలోచిస్తుంది అని నమ్మకం రాధికకు.

'అల్లాంటి రాజీ ఇంత తెలివి తక్కువగా ఎలా ప్రవర్తిస్తోందా?' అని ఆలోచిస్తోంది రాధిక.

"ఎందుకే ఇలా చేశావు?" మళ్లీ ప్రశ్నించింది రాధిక. ఇంతింత కళ్లతో ఆశ్చర్యంగా మళ్లీ అదే అదే ప్రశ్న వేసేటప్పటికి ముచ్చట, నవ్వూ వచ్చాయి రాజీకి.

"ఏం?" నాజూగ్గా ఉన్న ఆమె బంగారు గాజులు లెక్క పెడుతూ అన్నది నవ్వుతూ.

"ఏమేమిటే? మీ ఇంటికి వెళితే ఎంత గోలగా ఉందో తెలుసా? బంగారం లాంటి సంబంధం ఖాయం చేస్తే వద్దన్నావట, గోలచేశావట... పైగా కోపం వచ్చి ఇంట్లో నించి వచ్చేశావట. మీవాళ్లు అడ్డమైన తిట్లూ తిట్టేస్తున్నారు నిన్ను. మీ మేనమామలూ, అత్తయ్యలు... ఇంకా ఎవరెవరో దిగుతున్నారట... ఏమిటి కథ అసలు?"

"వాళ్లంతా ఎందుకు? ఛార్జీలు దండగ..." నిర్లిప్తంగా అన్నది రాజీ.

"ఎందుకేమిటి? మొదటి కూతురు పెళ్లి అని మీ నాన్నా అమ్మా రాశారట... ముహూర్తాలు కూడా పెట్టుకునే దాకా ఊరుకుని ఇప్పుడేమిటే గోల? ఏమైందసలు? నీకే పెళ్లి నచ్చలేదా? పెళ్లి కొడుకు నచ్చలేదా?"

"కాదు... పెళ్లి ధోరణే నచ్చలేదు..."

"అంటే?" అన్నది రాధిక.

"అంటేనా? చూడు రాధీ! నీ బంగారు గాజుల ఖరీదెంత?"

"ఏమో... పదివేలుంటాయేమో..."

"రవ్వల దుద్దులు?"

"ఎందుకే ఇప్పుడు? ఓ పదిహేను వేలుంటాయేమో..."

"అంటే నీ మామూలు అలంకరణ ఖరీదు దాదాపు పాతికవేలు. నాకు పెళ్లిలో మావాళ్లు పెట్టగలిగే బంగారం ఎంతో తెలుసా... మహా అయితే రెండు తులాలు..."

"ఎందుకే ఈ లెఖ్ఖలు... దానికీ నీ సాహసానికీ ఏమిటి సంబంధం?"

**జీవితంలో వివాహం అనే ఘట్టం మధురమైనదిగా భావించే మధ్య తరగతి యువతులు మన సమాజంలో ఎంతమంది వుంటారు? తమ పెళ్లిళ్లు కుటుంబ ఆర్థిక పరిస్థితులను అస్తవ్యస్తం చేస్తున్నాయని గ్రహించినప్పుడు వాళ్ల లేతమనసులు ఎంతగా క్షోభిస్తాయి? ఐతే, ఇవన్నీ చూస్తూ ఆక్రోశించినంత మాత్రాన సమస్యలు పరిష్కారమైపోతాయా? 'ఉన్న చోటు చాలును మాకు... ఇంకా వెనక్కి పోతామంటారు కూడా—మీలో కొందరు. ముందుకు పోతాం మేము—ప్రపంచం మా వెంట వస్తుంది.' అని మహాకవి చెప్పినట్లుగా, ఆత్మ విశ్వాసంతో తిరగబడింది ఓ వనిత. ఆమె గురించి మీరూ ఆలోచించండి!**

"ఏమిటా? ఇన్నాళ్లూ నువ్వూ, నీ స్టేటస్‌లో ఉన్నవాళ్లు ఎవరూ సాధారణంగా ఆలోచించని కొన్ని నిజాలు నీకు తెలియాలని... మా వంటి మధ్య తరగతి వాళ్లు పదివేలు బ్యాంకులో వెయ్యాలంటే నెలకొక వందరూపాయలు చొప్పున ఎన్ని నెలలు వెయ్యాలో తెలుసా? అసలు వంద మిగల్చడమంటే ఏమిటో తెలుసా?! పాలో కూరలో త్యాగం చెయ్యాలన్న మాట..."

మాట్లాడలేదు రాధిక... లక్షల డిపాజిట్లు, షేర్లు ఉన్న ఆ పిల్లకు ఈ లెఖ్ఖలు అర్థం కావలసిన అవసరం కూడా లేదేమో... కానీ ఆశ్చర్యంగా వింటోంది. ఎందుకంటే, ఆ పిల్ల ఇంట్లో తినే కూరల కన్నా పారేసే వంటకాలే ఎక్కువ. అందుకే ఆలోచిస్తోంది.

"నువ్వు వెంటనే అడగబోయే ప్రశ్న నాకు తెలుసు... దానికీ పెళ్లికీ ఏమిటి సంబంధం అని... నాకు కాబోయే భర్తగారి రేటు పదిహేను వేలు... వాచీ ఉంగరం, వెండి కంచం అడిగారట కానీ, దాని బదులు కూడా డబ్బుగా ఇంకొక ఐదు వేలు ఇస్తే ఫరవాలేదన్నారట."

"చవకే కదే... ఇదే మా వాళ్లలో అయితే లక్షలు పోయాలి. అయినా, ప్రావిడెంటు ఫండు మీద అప్పు చేసి మీనాన్న ఆ డబ్బు తెస్తానన్నారట కదా..."

"అవునూ... తెస్తానన్నారు... కానీ, అది నా పేరనో, అతని పేరనో మా జీవితపు ఒడుదుడుకులను ఆదుకునేందుకు గిఫ్ట్‌గా ఇవ్వడం లేదు రాజీ... అది మాకు ఇన్స్యూరెన్స్ పాలసీ కాదే. అతని వాళ్లకు, చుట్టాలకు పెళ్లి ఖర్చులకు, మెహర్బానీలకు, బట్టలకూ అయిపోతుందిట. ఇంకా వాళ్లకు అప్పు అవుతుందిట..."

"అవును మరి... వాళ్ల ఖర్చులు తప్పవు కదా?"

"ఇంకా విను... ఇవి కాక, పెళ్లి ఖర్చులు, మా అమ్మా నాన్నా లేని హెూదాలకు పోయి, మీ బోటి వాళ్లను చూసి పులిని నక్క వాతలాగా "డబ్బుదేముంది... మర్యాద పోతే మళ్లీ వస్తుందా?" అంటూ లేని హెూదా నటిస్తూ ఖర్చు పెట్టబోయేది మరో ఇరవైవేలు..."

"అలా అంటే ఎలా రాజీ... నా పెళ్లికీ అయింది రెండు లక్షలు. నాకిచ్చిన కట్నం మాటేమిటి? దాదాపు ఇరవై లక్షలు..."

"ఆఁ! అదీ ప్రపోర్షన్... మీ నాన్న కోటీశ్వరుడైతే మీ ఖర్చు అది. కానీ, మానాన్న... 1500 జీతం లావేలేమిటి? పైగా మీనాన్న ఖర్చు పెట్టింది మీ బ్లాక్ మనీ... నీకిచ్చిన కట్నం పొలంగా, షేర్లుగా నీ పేరు మీదే వుంది. నీకిచ్చిన కారు నువ్వూ వాడుకుంటున్నావు. పెద్దింట్లో నిన్ను ఇవ్వడం వలన మీనాన్న బిజినెస్ సర్కిల్ మరింత పెరిగింది. నువ్వు మరింత స్థోమతులోకి అడుగుపెట్టావు. కానీ, ఈ పెళ్లి అనే బిజినెస్‌లో మా కుటుంబానికీ, నాకూ, నా కాబోయే అత్త వారికీ అంతా లాసే... అంతా నష్టమే. లెఖ్ఖవేస్తే మిగిలేది వాళ్లకు ఏడువేల అప్పు, మానాన్నకు ముప్పైవేల అప్పు... అంటే మరొక పదేళ్లు అందరి ఆయుర్దాయాలూ గట్టిగా ఉంటే, అటు వాళ్లూ ఇటు వాళ్లూ అప్పులు తీర్చడానికి బ్రతకాలన్న మాట. మరి ఆ తరవాత పెళ్లిళ్ల మాటేమిటి?"

"అదేమిటే... పెళ్లి బిజినెస్సా?" మందలింపుగా అన్నది రాధిక.

"శుభ్రంగా అంతే... అలాగే అనుకుంటే సుఖం... అవతలి వ్యక్తి లేకుండా నేనూ, నేను లేకుండా అతనూ బ్రతకలేనంత ప్రేమ కేవలం పెళ్లి చూపుల్తో కలగదు మాకు. ఒక సాంఘిక రక్షణ కోసం, కొన్ని అవసరాలకోసం ఒక తరం మరింత అప్పుల్తో వున్న అంతస్తును కోల్పోయి, వీధిన పడిపోయే స్థితికి కారణం ఈ పెళ్లే అయితే నాకిది వద్దు..."

"ఏమిటి రాజీ మరీ... సున్నితత్వమే లేదేమే నీకూ?" నాజూగ్గా అన్నది రాధిక.

"సున్నితత్వమా?" తోక తొక్కిన తాచులా లేచింది రాజీ... "ఎలా ఉంటుందే... ఏ.సి. కార్లో వెనక సీట్లో కూర్చుని ఆరు రూపాయల ఐస్‌క్రీం తింటూ మీ ఆయన వంక చూసే నీ కళ్లకు అది తెలుసేమో... సారీ..." ఆవేశం కంట్రోల్ చేసుకుంటూ, మాటా మాటా కూరుస్తూ ఆలోచిస్తూ అన్నది రాజీ. "సంవత్సరం తరవాత బహుశా మాకు వచ్చే ఆలోచన లేమిటో తెలుసా? మూర పువ్వులు రూపాయా? దండగ... పావు కిలో బెండకాయలొస్తాయి. ఒక పూట కూర... ఇలా అనిపించే జీవితాలలో స్పందన, సౌందర్యం ఉండాలంటే, అవి చచ్చిపోకూడదనుకుంటే... మా ఇద్దరి మధ్యా డబ్బుకుమించిన భావుకత ఉండాలి రాజీ."

"అదే పోనీ ఎందుకుండదనుకుంటున్నావు? ఇలా ఆలోచిస్తే ఎవ్వరూ పెళ్లి చేసుకోలేరే..." ఆమె ఆవేశానికి విస్తుపోతూనే నచ్చ చెపుతున్నట్లుగా అన్నది రాధిక. అంటోందే కానీ, ఆమె ఆలోచనలకు కూడా రెక్కలు విప్పింది రాజీ తన మాటలతో. ఆ పిల్ల చెప్పేదాన్లో ఏదీ అబద్ధం లేదని తెలుస్తోంది రాధికకు. కానీ, ఇలా ఆలోచించే వాళ్లెవరు?

"హుఁ! ఈ సమస్యల ఇసుక తుపాన్ల ప్రపంచంలో ఆ స్పందన చిన్న నీటి చెలమ రాధీ! కానీ, దురదృష్టమేమిటో తెలుసా... దాన్ని కాపాడుకునే పరిస్థితులు, మనస్తత్వం కూడా చాలా అవసరం రాధీ... అంతే కాదు... అది ఇద్దరికీ ఉండటం అవసరం... భార్య, ఆమె కట్టుకున్న కొత్త చీర, ఆమె చిరునవ్వు, ఆమె మాటలో కొత్తదనం, ఆమె పలకరింపులో స్వాంతన... ఇవన్నీ మగవాడికి అలవాటుగా మారకూడదు రాధీ! అతని విషయంలోనూ అంతే... అతను, అతని విసుగు, సంపాదనా, శృంగారం, బాధ్యతలు... 'ఆఁ! ఇవన్నీ ఎప్పుడూ ఉండేవే...' అని ఆమెకూ అనిపించకూడదు..."

"తెలివిగల వాళ్లు అలా జాగ్రత్త పడవచ్చు కదా..." కొంగుమెలి పెడుతూ అన్నది రాధిక.

ఆ మాట అననైతే అన్నది కానీ రాధికకు అందులో ఎంత వెలితి ఉన్నదో అర్థమైపోయింది. ఆలోచనలు కాంతి కిరణం కన్న అద్భుతమైన వేగంతో పరిగెత్తగలవు. కొన్ని వేల మెగాటన్నుల విద్యుచ్ఛక్తి కన్న తీవ్రమైన షాక్ ఇప్పించగలవు.

అప్పుడామెలో అంతర్వాణి అంటున్న మాటలివే "ఈ మొనాటనీ, బోరు, మీ లెవెల్ వాళ్లకే కాదు తల్లీ... మాకూ తప్పదు... ఫైవ్ స్టార్ హొటల్లో డిన్నర్లు, ఏ.సి. థియేటర్‌లో బాక్స్ బుకింగులు... వీటి కోసం అలంకరించుకోవడంలో ఉన్న సరదా ఆ తరవాత ఉండదు. ఆ వచ్చే గెస్టుల అసందర్భపు మాటలు, నిజాయితీ లేని చూపులు, విపరీతంగా దిద్దిన నాగరికపుటందాలు, రవ్వల దుద్దులు, పట్టు చీరలు, మల్లెపూవుల ముడులు ఉన్న యాభయ్యేవ పడిలో పడ్డ వాళ్ల దగ్గర్నుంచీ ఇల్లాలితనం అనే చీర వెనకాల అణిచి దాచిన కోరికల చూపులు. ఇవన్నీ ఎంత విసుగు, తలనెప్పి ఇస్తాయో నీకేం తెలుసు?! ఎప్టికాన్స్‌లా మాట్లాడ్డానికేం లేక, మాట్లాడలేక ప్రతి భార్యా భర్తా ప్రపంచం కోసం చుట్టూ ఉన్నవాళ్ల కోసం ఎంత నటిస్తారో, తామిద్దరం ఒకళ్లకొకళ్లం ఎంత దగ్గరో చెప్పడం కోసం ఎంత ప్రయత్నిస్తారో, ఆఖరికి ఆడపిల్ల అర్ధరాత్రి బెడ్ మీద సెడెటివ్‌తోనూ, మొగవాడు రెండు పెగ్గులతోనూ దగ్గరతనానికి ఎలా లొంగిపోతారో... మా వర్గం వాళ్లు కూడా నువ్వు చెప్పే నీటి చెలమను కాపాడుకోలేక పోతున్నాం రాజీ!" ఇంక ఆలోచించడానికే భయపడింది రాధిక... చాలా చాలా కొత్త ఆలోచనలు మేధస్సు తలుపులు తీసుకుని రివ్వున పక్షిపిల్లల్లా రివ్వు రివ్వున తన చుట్టూ పరుగుతీస్తూ, అరుస్తూ గల్లంతు చేస్తున్నట్లు ఉలిక్కి పడింది రాధిక.

"ఏమిటే అలా జలదరించింది ఒళ్లు... రాధీ..." కంగారుగా పిలిచింది రాజీ.

"ఆఁ! ఏం లేదు..."

"ఏమిటి? నా ఆలోచనలు నిన్నంతగా భయపెట్టాయా?" మెల్లిగా అన్నది.

"కాదు... ఆలోచింపచేశాయ్ రాజీ" మెల్లిగా అన్నది రాధిక.

"హాయ్... నిజమా... నిజంగా నేను గొప్పే అయితే..."

"ఏం?"

"మా ఇంట్లో వాళ్లనూ, చుట్టు పక్కల వాళ్లనూ, అంతెందుకు కాబోయే భర్తను ఇలా ఆలోచించమని అభ్యర్థించి, బతిమాలి, అలిసిపోయాను రాధీ... కానీ నువ్వు ఒక్కదానివీ మాత్రం ఆలోచిస్తానంటున్నావు..."

"అవునూ... ఆ పెళ్లికొడుకుతో పోనీ ఇవన్నీ మాట్లాడావా?" నవ్వింది రాజీ.

"హు! అలనాటి దుష్యంతుడి నుంచి ఈ 20వ శతాబ్దపు అబ్బాయిల వరకూ అందంగా వుండి బ్రెయిన్స్ లేకుండా కన్నీరు కార్చేసి భుజం మీద తలవాల్చే అమ్మాయి మీద మోజే కానీ, ఆలోచించే ఆడవాళ్లు వీళ్లకక్కర్లేదు రాధీ... ఇది సగటు మగవాడి మనస్తత్వం. ఉన్న కలల కోరికల్ని అణుచుకొని, లేని సౌకుమార్యం, ఉందని భావుకత నటించే అమ్మాయే కావాలి. ఆ అమ్మాయి నటించే నిస్సహాయత అతని 'అహాన్ని' ఫీడ్ చేస్తుంది. ఇది ఆత్మవంచనకు పరాకాష్ఠ అని తెలుసువాళ్లకీ... అయినా అంతే."

"నిజమే... ఆడపిల్ల ఆలోచించినా ఒప్పుకుంటారేమో కానీ, ఆచరించడమే? ఇంతకీ అతనేమన్నాడు?!" కుతూహలంగా ఉంది రాధికకు.

"ఏమంటాడు? మనిద్దరి కుటుంబాలు ఆర్థికంగా ఐదు సంవత్సరాలు వెనక్కు వెళ్లాల్సిరావడమే కాకుండా, మనిద్దరం మళ్లీ మంచం కొనుక్కోవాలన్నా దిండు కొనుక్కోవాలన్నా ఆలోచించే స్థితిలో నిలబెట్టే ఈ పెళ్లి ఖర్చు అవసరమా?" అని అడిగాను.

"నీ మొహం... అలా ఫ్రాంక్‌గా అడిగితే జడుసుకుని ఉంటాడు మానవుడు... కొంచెం కన్విన్సింగా..."

"ఇంకా నయం... చక్కగా బంగారు తల్లిలా, నేల చూపులు చూసుకుంటూ, తెలుగు సినిమాలో పల్లెటూరి హీరోయిన్లా చెప్పాను... నాకు మాత్రం ఈ పెళ్లి చెడగొట్టుకోవాలని ఉందా రాధీ!" ఆ గొంతులో విషాదానికి కదిలిపోయింది రాధిక.

"అయాం సారీ! నిన్నుపోగొట్టుకోవడం అతని దురదృష్టమేనే... మరి ఏమన్నాడు?"

"ఏమంటాడు... ఆ తరవాత అతని జవాబు విన్న తరవాత ఇతని కోసం ఇంత భావుకత వేస్ట్ చేసుకోవడం అనవసరమనిపించింది."

"ఏం?"

"మనకు జరగబోయేది ఇదొక్కటే పెళ్లికదా! అన్నాడు"

"అదేమిటే..." నవ్వాపుకుంటూ అన్నది రాధిక.

"ఇంకేం విన్నావు? మా అత్తయ్యలకూ వాళ్లకూ రైలు ఛార్జీలు ఇవ్వక పోయినా, బట్టలు పెట్టకపోయినా బావుండదు. మా అమ్మను దెప్పి పొడుస్తారు. అసలు నాకు టి.వి., ఫ్రిజ్, ఫర్నిచర్, రెండెకరాల పొలం అన్నీ ఇచ్చి పిల్లనిస్తామని వచ్చారు. కానీ నీది పర్మనెంటు ఉద్యోగం కదా అని టెంప్ట్ అయ్యాను" అని నిజం చెప్పాడే... మరి ఈ పెళ్లికి పసుపుతాడు, మంగళ సూత్రాలు, బ్రాహ్మడు, నాగవల్లి కుండలు, సన్నాయి మేళాలు అతనే జీవితం అనుకునే పెళ్లి కూతురు, ఇవన్నీ అవసరమా?! ఇప్పుడు చెప్పు... నువ్వు నేనూ మాట్లాడుకున్న భావుకత, సున్నితమైన జలదరింపులు, కనుకొనల్లో భావావేశాలు, కృష్ణశాస్త్రి కవిత్వాలూ... ఇవన్నీ చచ్చిపోతే సమాధి కట్టడానికి పెళ్లి పేరుతో చందాలేస్తున్నామేమో మనం అనిపించడం లేదూ?" ఆమె గొంతులో ఆవేశానికి ఉలిక్కి పడింది రాధిక.

"సరే! పోనీ... పెళ్లికొడుకు, పెళ్లి పద్ధతి నచ్చలేదనుకో. ఇంట్లోనించి వచ్చెయ్యడమెందుకే?"

"ఎందుకా? మా అమ్మా, నాన్నా కొంచెం సెంటిమెంటల్ ప్లే వేశారు. 'ఉరేసుకుంటాం, కిరసనాయిలు పోసి తగల పెట్టుకుంటాము, నీ తరవాత వాళ్లకు పెళ్లికాదు..' వగైరా వగైరాలతో. దాంతో ఒళ్లుమండి, కొంచెం షాక్ ఇస్తేనన్నా ఆలోచిస్తారేమోనని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరతానని వచ్చేశాను. అప్పుడే రాయబారాలు మొదలైనాయిగా... ఒక వారంలో మానాన్న వస్తారు!!"

"రాకపోతే ఇలాగే ఉండి పోతావా?"

"నీ మొహం రాధీ! రాకపోతే అనకు... వస్తారు... పాలకార్డులకు డబ్బు, అద్దెలో సగం ప్రతినెలా గత రెండేళ్లుగా నేనే కడుతున్నాను. ఆ వెలితేమిటో వాళ్లకూ తెలుసు. రారనకు... రాక తప్పదు. ఇంత తెలిసీవాళ్ల మూర్ఖత్వం వదులుకోకపోతే, అవివాహితగానన్నా మిగిలి పోతాను కానీ, ఆర్థిక వ్యవస్థ తల్లకిందులు కావడానికి నేనొక కారణం మాత్రం కాను."

"అలా అయితే, చాలామంది వృద్ధ కన్యలుగా మిగిలి

పోవలసిందేనా రాజీ...''

"నీ మొహం... నాలాగా ఆలోచించే మగపిల్లలూ ఉంటారు. లేరనకు. కొన్ని వ్యామోహాలు వదులుకుంటే, ఎవరికీ నష్టం లేని పెళ్లిళ్లు, సంసారాలు అప్పుల్లో కూల్చని పెళ్లిళ్లు, ప్రేమలు నటించక్కర్లేని పెళ్లిళ్లు, స్నిగ్ధత, సౌకుమార్యం ఉన్న పెళ్లిళ్లు, ఒకళ్లకోసం ఒకళ్లు నిజంగా బ్రతికే పెళ్లిళ్లు జరుగుతాయి... జరగ వంటావా?... నేనే నయం... ఆర్థికంగానన్నా స్వతంత్రురా లిని... ఆంధ్రదేశంలో జిల్లాకు కనీసం అర్వైమంది ఆడపిల్లలు, ఇంటర్ దాటని వాళ్లు, పాతికేళ్లు దాటిపో తున్న వాళ్లు, కట్నాలు, లాంఛనాలు ఇచ్చుకోలేని వాళ్లు, ఉద్యోగం చేసే సమర్థతా, చొరవా లేనివాళ్లు, ఎవరైనా పెళ్లి చేస్తే మంచి ఇల్లాళ్లుగా వంటా వార్పూ చేస్తూ, పిల్లల్ని కనేస్తూ బ్రతికేద్దామనుకునే వాళ్లూ, ఏదో లాటరీ లాంటి అదృష్టం తగిలి గొప్ప ఇంటి కోడళ్లమైపోతామను కునే వాళ్లూ—ఉన్నారు. ఇప్పటికీ కట్నాల హత్యలు, ఆడపిల్లలు ఆత్మహత్యలు, శిశుహత్యలూ జరుగుతు న్నాయి. తెలుసుగా...

"ఆనాడు ఆదిమ జాతివారు శిశువు ఆడపిల్ల అయితే కొండ మీద నుంచి లోయల్లోకి విసిరేస్తే, ఈనాడు నవ నాగరీకులమనే వాళ్లు ఆరంభ దశలోనే పరీక్షించుకుని ఆడపిల్లని తెలిస్తే అప్పుడే మట్టుపెట్టే స్తున్నారు... ఆనాటికీ, ఈనాటికీ తేడా ఏమిటంటే, వాళ్లు ఆకులూ, తోళ్లూ కట్టుకుంటే, వీళ్లో నైలాన్లు, నైలెక్సులూ కట్టుకుంటున్నారు... మానవత్వమేమీ ఎదగలేదు. ఆడ పిల్ల పెద్ద కమిట్‌మెంటు అనే ఆలోచన చావలేదు. ఇప్పటికైనా మేధావి వర్గం నిద్రలేవకపోతే, జరగబోయే పరిణామాలకూ, సంఘంలో వచ్చే తారుమారుకూ, తండ్రి పేరు తెలియని అనాథ బిడ్డలకు, అభిజాత్యం చంపుకున్న ఆడతనానికి జవాబు చెప్పుకోలేని ఈ వ్యవస్థ సంస్కరణ కోసం భగవంతుడు మరొక అవతారం ఎత్తాలి...'' ఆవేశం, ఉద్రేకం రాజీని వశవర్చు కున్నాయి. గటగటా మంచి నీళ్లు తాగేసింది. వాతావ రణం ఒక్కసారి బరువుగా అయిపోయింది.

రాధిక కళ్ల ముందర రాజీ చిత్రించిన భవిష్యత్తులోని భయంకర పరిస్థితి సినిమాలా కనిపిస్తోంది...కానీ, తన చుట్టూ ఉండే మనుష్యుల అజ్ఞానాన్ని పోగొట్టి కనువిప్పు కలిగించిన జీసస్‌ను కొలిచే ఈనాటి జనం ఆనాడు సిలువ వేసి కక్షతీర్చుకున్నారు... తప్పదు. ఇలా ఆలో చించే రాజీని సంఘం భయపెడుతుంది. శపిస్తుంది, నిందవేస్తుంది, వేటాడుతుంది. కానీ, ఇవన్నీ ఎదుర్కొ నేందుకు రాజీలో ఆత్మ విశ్వాసం ఉన్నది. "భగవంతు డా! రాజీలాంటి మరికొందరు ఆడపిల్లల్ని తయారు చెయ్యి...'' మనస్ఫూర్తిగా ప్రార్థించింది రాధిక. దూరంగా చర్చ్ గంటలు మ్రోగాయి అవుననన్నట్లు.

ఉలిక్కి పడింది రాధిక.

"వెళ్తానే... నిన్ను ఒప్పించాలని వచ్చాను... కానీ నువ్వే కరెక్టనిపిస్తోంది... మావారికి క్లబ్‌కు కారు పంపాలి. వస్తానేం...'' అని క్షణం ఆగి రాజీని గట్టిగా కౌగలించు కుని చటుక్కున ముద్దుపెట్టుకుని వెళ్లిపోయింది రాధిక. ఆశ్చర్యపోయి, కాసేపట్లో హాయిగా నవ్వుకుంది రాజీ.

తనకు అర్థం చేసుకున్న ఒక్క మనిషి... చాలు... తృప్తిగా నవ్వుకుని చేతిలో గోపీచంద్ పుస్తకం వంక చూసింది రాజీ...

'మన చుట్టూ ప్రపంచంలో సుఖపడటం కోసం పడే కష్టంలో దొంగ వేదాంతం, పాలిటిక్స్‌ల బూచి, బద్ధకంలో హాయి, ఊహల్లో శ్రమ, సామర్థ్యం తెలియకుండా ఆశించడం, సంఘ శ్రేయస్సుకు ఉపయోగపడని జ్ఞానం వలన కలిగే ఆటంకం, తనను కలుపుకోకుండా సొసై టీని చూడ్డం, అజ్ఞాన మహానగరంలో మనిషి రిక్రియే షన్ కోసం రిఫార్మేషన్ మాట్లాడుతుంటాడు ఎలా మరి?!'

ఈ వాక్యాలు మళ్లీ మళ్లీ చదివింది రాజీ... కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి.

"మహా రచయితల్లారా! ఆలోచింప చెయ్యండి ఈ జనాన్ని... మానవతా వాదుల్లారా! మానవత్వం సమాధి కానీయకండి... మహా ఋషుల్లారా! దైవం పారిపోయే పరిస్థితి సృష్టించనీయకండి... విశ్వ చైతన్యమా! నువ్వు ఆశీర్వదించని ఈ సమాజం ఒక సమాధిగా మారనీ యకు.''

ఆ మధ్య తరగతి ఆడపిల్ల, తన కోసం, తనలాంటి వదిమంది కోసం నిస్సహాయతతో పెదవి నొక్కిపెట్టి కారుస్తున్న కన్నీరు... దానికి అర్థమున్నదో లేదో కాలమే చెప్పాలి మరి. □




హైదరాబాదులోని మహిళాభ్యుదయ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం 140వ జయంతి సభ జరిగింది. ఈ సభలో లోకాయుక్త శ్రీ ఆవుల సాంబశివరావు ప్రసంగిస్తూ కందుకూరి స్త్రీ జాతికి చేసిన సేవలను కొనియాడారు. కేవలం వితంతు వివాహాలను జరిపించినందుకు మాత్రమే కందుకూరి స్మరణను పరిమితం చేయకుండా, స్త్రీ విద్యా వ్యాప్తికి వీరేశలింగం గారు చేసిన కృషికి కూడా మనం వారిని సంస్మరించాలనీ, విజ్ఞానాన్ని భావ పునర్వికాసాన్ని ప్రజలకు అందించడానికి వీరేశలింగం ఎంతగానో శ్ర మించారనీ, పత్రికలను, రచనా పాటవాన్ని తన భావ ప్రచారానికి వినియోగించారని శ్రీ ఆవుల సాంబశివరావు వివరించారు.

ప్రఖ్యాత గాంధేయవాది, సామాజిక కార్యకర్త శ్రీమతి విద్య సభకు అధ్యక్షత వహించి తన వువన్యాసంలో ఈనాటి స్త్రీల స్థితి గురించి ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీల సమస్యలు పెరుగుతున్నాయనీ, ఈ కాలపు స్త్రీ లలో స్వేచ్ఛా పిపాస సన్నగిల్లుతున్నదనీ అభిప్రాయ ప్రకటన చేశారు. స్త్రీ విద్య కోసం, స్త్రీ స్వాతంత్ర్యం కొరకు పోరాడిన గాంధీజీ, వినోబాభావేలను స్మరించారు. లాభదృష్టి, ధనార్జనా భావన లేకుండా సామాజిక సంస్క రణ, సాంఘిక సేవలకు పూనుకోవాలని ఆమె వుద్బో ధించారు.

ప్రముఖ సాహితీవేత్త శ్రీ అక్కిరాజు రమాపతిరావు ప్రసంగిస్తూ "స్త్రీ స్వేచ్ఛను కాంక్షించిన మహావ్యక్తి వీరేశలింగం'' అని అభివర్ణించారు. గాంధీజీ, అంబే ద్కర్‌ల కాలానికి ముందే అస్పృశ్యతను ఖండించి, ఆచరణలో అంటరానితనాన్ని విడనాడిన మహనీయుడి గా వీరేశలింగాన్ని పేర్కొన్నారు.

అభినందన సాహితీ సంస్కృతిక సమాఖ్య కార్యదర్శి శ్రీమతి భవానీ శరత్, వీరేశలింగం స్మృతికి నివాళులు అర్పించారు.

"నిర్భయత్వాన్ని స్త్రీలకు అలవరచిన సాహసి వీరేశ లింగం'' అని ఆయనను మహిళాభ్యుదయ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి మల్లాది సుబ్బమ్మ పేర్కొన్నారు. వీరేశలింగం గారి భార్య శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ త్యాగాన్ని ధైర్యాన్ని ఆమె ప్రశంసించారు.

—మల్లాది సుబ్బమ్మ